క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: క్లాక్‌టవర్, జేమ్స్ స్ట్రీట్ సబ్‌స్టేషన్ పరిధిలో ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని సికింద్రాబాద్ సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు మార్గదర్శి చిట్‌ఫండ్, ఆంధ్రా బ్యాంక్ ఏటీఎం, సీఎంఆర్ టెక్స్‌టైల్, చెన్నై షాపింగ్ మాల్ ప్రాంతాలు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఆర్పీరోడ్‌లో, 12 గంటల నుంచి ఒంటిగంట వరకు అంజలీ థియేటర్, సాయిబాబా దేవాలయం, ఆవులమంద, ఆర్పీరోడ్ దర్గా ప్రాంతాలు 11 గంటల నుంచి 12.30గంటల వరకు ప్యారడైజ్ ఫీడర్ పరిధిలోని ప్యారడైజ్ హోటల్ ప్రధాన రహదారి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రాంతాల్లో 12.30గంటల నుంచి 1.30 గంటల వరకు పార్క్‌లేన్, 2.30 గంటల నుంచి సాయంత్రం 4 వరకు నక్షత్రా హోటల్, 4 గంటల నుంచి 5.30గంటల వరకు హరిహర కళాభవన్ ఫీడర్ పరిధిలోని శ్రీరాంనగర్, కళానికేత్, ఎన్‌టీపీసీ, మున్సిపల్ కార్మిక సంఘం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

మల్లు రవికి పోలీసుల నోటీసులు

రాంగోపాల్‌పేట్: ఫేస్‌బుక్ పేజీలో కేసీఆర్, కేటీఆర్, కవితలపై వ్యంగ్యంగా కార్టూన్‌లు పోస్ట్‌చేసి కించపరిచిన కేసులో టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవికి మార్కెట్ పోలీసులు 41 సీఆర్పీ కింద నోటీసులు ఇచ్చారు. శనివారం మార్కెట్ ఎస్‌ఐ మమత గాంధీభవన్‌కు వెళ్లి మల్లు రవికి నోటీసులు అందించారు. తెలంగాణ గళం ఫేస్‌బుక్ పేజీలో గత నెల 12న మార్ఫింగ్ చేసిన ఫొటోలతో కార్టూన్లు పోస్టు చేశారని ఆదయ్యనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు మహేందర్ మార్కెట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు మల్లు రవిని ఈ నెల 8వ తేదీన పోలీస్ స్టేషన్‌కు రావాలని నోటీసులు జారీ చేశారు.

నేడు చండీ హోమం

సనత్‌నగర్: మాఘమాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలోని దుర్గామాత ఆలయంలో ఆదివారం ఉదయం 8 గంటలకు చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

కేన్సర్‌ను చికిత్సతో నయం చేయొచ్చు

డాక్టర్ పాలంకి సత్య దత్తాత్రేయ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

కంటోన్మెంట్: కేన్సర్‌ను పూర్తిగా నయం చేయగలిగే అధునాతన చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని, కేన్సర్ బాధితులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రెనోవా–సౌమ్య కేన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ పాలంకి సత్య దత్తాత్రేయ అన్నారు. వరల్డ్ కేన్సర్ డే పురస్కరించుకుని తమ ఆసుపత్రిలో చికిత్స తీసుకుని వ్యాధిని జయించిన వారికి సన్మానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పాలంకి సత్య మాట్లాడుతూ.. కేన్సర్ వ్యాధిపై పోరాటం కేవలం రోగి, వైద్యుడికి సంబంధించినదే కాదని, కుటుంబ సభ్యుల పాత్ర కూడా కీలకమన్నారు. కేన్సర్ వస్తే బతకరనేది కేవలం అపోహ మాత్రమేనని డాక్టర్ యుగంధర్ శర్మ అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లలితారెడ్డి, జనార్ధన్, ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం

రాంగోపాల్‌పేట్: వరల్డ్ కేన్సర్ డే సందర్భంగా శనివారం హైదరాబాద్ ఆర్చ్ డయాసిస్ సోషల్ సర్వీస్ సొసైటీ (హెచ్‌ఎస్ఎస్ఎస్) ఆధ్వర్యంలో



కేన్సర్‌ను జయించిన వారిని సన్మానిస్తున్న వైద్యులు

అవగాహన ర్యాలీ నిర్వహించారు. సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే ప్రాణాపాయం తప్పుతుందని, కేన్సర్ రాకుండా పొగాకు ఉత్పత్తులు, బీడీ సిగరెట్, మద్యపానం వాటికి దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎస్ఎస్ఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ ఆంటోని మాట్లాడుతూ.. హైదరాబాద్ ఆర్చ్ డయాసిస్ కార్డినల్ పూల ఆంథోనీ ఆదేశాల మేరకు ఈ నెల మొత్తం కేన్సర్ అవగాహన నెలగా ఆచరిస్తూ పలు ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పిల్లలతో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడంతో తల్లిదండ్రులు, సమాజంలో కొంత మార్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫాదర్ ఇన్నయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

ఆస్టర్ ప్రైమ్‌లో రక్తదానం

అమీర్‌పేట: ప్రపంచ కేన్సర్ డే పురస్కరించుకుని అమీర్‌పేట ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రిలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న కేన్సర్ రోగులతో పాటు అవసరమైన ఇతర రోగుల కోసం ప్రత్యేకంగా శిబిరం ఏర్పాటు చేసినట్లు పాథాలజీ విభాగం అధిపతి డాక్టర్ రమాదేవి అన్నారు. ఈ సందర్భంగా 50 మంది ఉద్యోగులు రక్తదానం చేశారన్నారు.

బీఆర్‌ఎస్ అబద్ధాలను తిప్పికొట్టాలి

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

కంటోన్మెంట్: తెలంగాణలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు త్రిముఖ వ్యూహంతో ముందుకెళ్లాలని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం కంటోన్మెంట్ లీ ప్యాలెస్ గార్డెన్స్‌లో నిర్వహించిన బీజేపీ మహంకాళీ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మంచినీటి సమస్య, డబుల్ బెడ్రూమ్‌ల కేటాయింపు, దళితబంధు, మహిళా సంఘాల సమస్యలపై పోరాటం చేయాలన్నారు. దివంగత పీజేఆర్ మాదిరిగా ప్రజా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 50 లక్షల ఇళ్లకైనా నిధులిచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉంటే, కేసీఆర్ ప్రభుత్వం 2 లక్షల ఇళ్లు కూడా నిర్మించలేదన్నారు. అదే ఆంధ్రప్రదేశ్‌లో 30 లక్షల ఇళ్లు నిర్మించారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ నేతలు కేంద్రం రాష్ట్రానికి ఏమీ చేయడం లేదని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఏమేం పనులు చేసిందో వివరించేందుకు త్వరలోనే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిద్దామన్నారు. కాంట్రాక్టర్లకు ఇచ్చేందుకు డబ్బులు లేక జీహెచ్ఎంసీని దివాలా తీయించిన బీఆర్‌ఎస్ పార్టీ కోట్లాది రూపాయలతో ఎన్నికలకు సిద్ధమవుతోందన్నారు. జిల్లా అధ్యక్షులు శ్యామ్ సుందర్, మర్రి శశిధర్ రెడ్డి, నాగూరు నామోజీ, జే. రామకృష్ణ, బండ కార్తీక రెడ్డి, మేకల సారంగపాణి, పెద్ది రవి, రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్లు దీపిక, సుచిత్ర, సరళ పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ప్రవేశాల ప్రక్రియ లోపభూయిష్టం

న్యాయశాస్త్ర డీన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్



మాట్లాడుతున్న ప్రొ.గాలి వినోద్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ–2022 ప్రవేశాల ప్రక్రియ లోపభూయిష్టంగా ఉందని న్యాయశాస్త్రం విభాగం డీన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ ఆరోపించారు. శనివారం ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ పొలిటికల్ సైన్స్ విభాగం సెమినార్ హాల్లో పీహెచ్‌డీ ప్రవేశాల అర్హత మార్కులు–ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు అన్యాయం అనే అంశంపై జరిగిన చర్చలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పరీక్ష విధానం, ప్రశ్నల సంఖ్య, అర్హత మార్కులు, రిజర్వేషన్ల అమలు తదితర నిబంధనలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల ప్రవేశాలకు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. ప్రవేశ పరీక్షలో తప్పని సరిగా 50 మార్కులు రీసెర్చ్ మెథడాలజీ నుంచి ప్రశ్నలు ఉండాలి.. కానీ ఒక్కటి కూడా లేదన్నారు. పరీక్షలో 100 మార్కుల పేపర్‌ను 70 మార్కులకు కుదించి రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తున్న నూతన జాతీయ విద్య విధానాన్ని (ఎన్‌ఈపీ–2020) ఓయూలో అమలు చేస్తూ విద్యార్థులకు నష్టం చేస్తున్నారని ఆరోపించారు. కేవలం కేంద్రం మెప్పుకోసం ఎన్‌ఈపీని ఓయూలో బలవంతంగా అమలు చేస్తూ రిజర్వేషన్ విద్యార్థులకు వీసీ ప్రొ.రవీందర్ అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రొ.చంద్రునాయక్, యూజీసీ డీన్ ప్రొ.మల్లేశం, ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ ప్రొ.మంగు, బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలగనివ్వం

జెక్‌కాలనీ నివాసితుల సమావేశంలో మంత్రి తలసాని



మాట్లాడుతున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ఎవరికీ ఇబ్బందులు కలిగించాలనే ఆలోచన చేయలేదని, ప్రజా సమస్యల పరిష్కారానికే తాను అధిక ప్రాధాన్యమిచ్చినట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్పష్టం చేశారు. ఎర్రగడ్డ గోకుల్ థియేటర్ ఎదురుగా జెక్‌కాలనీ ప్రవేశద్వారం నుంచి హనుమాన్ దేవస్థానం కమాన్ వరకు ఆక్రమణలను గురవుతున్న ఫుట్‌పాత్‌లను తొలగించి పూర్తి స్థాయిలో రోడ్డును విస్తరించాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు, అధికారులతో కలిసి శనివారం ఆయన కాలనీలో పర్యటించారు. జెక్‌కాలనీ నుంచి హనుమాన్ దేవస్థానం వరకు రహదారిని అభివృద్ధితో పాటు చేసి ఇక్కడి రోడ్డును వీడీసీసీ రహదారిగా మార్చుతున్నట్లు వెల్లడించారు. కాలనీ అవసరాలకు అవసరమైన ఖాళీ స్థలం కేటాయింపు విషయంలో త్వరలో ఓ నిర్ణయం తీసుకుంటామని సనత్‌నగర్–ఎర్రగడ్డ మార్గంలోనూ రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఇదిలా ఉండగా గోకుల్ థియేటర్ ఎదురుగా జెక్ కాలనీ ప్రవేశద్వారం వద్ద మొదలుపెట్టిన హనుమాన్ దేవస్థానం ఆర్చి నిర్మాణ పనులను సైతం కొనసాగించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జెక్ కాలనీ అధ్యక్షుడు జి.సూర్యశంకర్‌రెడ్డి, గ్రీన్‌సిటీ అధినేత కొండ్రాజు సుబ్బరాజు, కాలనీ ప్రతినిధులు సురేష్‌గౌడ్, డాక్టర్ రాఘవయ్య, సురేష్‌చౌదరి, అనంతరెడ్డి, పూర్మానీ మల్లారెడ్డి, శివారెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రమేష్ పాల్గొన్నారు.

నియామకం



సనత్‌నగర్: బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులుగా సనత్‌నగర్‌కు చెందిన సీనియర్ నేత ఆకూరి శ్రీనివాసరావు నియమితులయ్యారు. శనివారం ఆయన జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.తనపై నమ్మకం ఉంచి జిల్లా కార్యవర్గ సభ్యులుగా నియమించినందుకు జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

హెడ్ పోస్టాఫీస్ ఆధ్వర్యంలో ప్రత్యేక మేళా

రసూల్‌పురా: న్యూఢిల్లీలో ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు జాతీయ స్థాయిలో అమత్‌పెక్స్ కార్యక్రమంలో భాగంగా తపాలా స్టాంపుల ప్రదర్శన నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా దేశవ్యాప్తంగా 7.5 లక్షల సుకన్య సమృద్ధి ఖాతాలు తెరవడానికి సమాయత్తమైంది. ఈ సందర్భంగా సికింద్రాబాద్ హెడ్ పోస్టాఫీస్ సీనియర్ పోస్ట్‌మాస్టర్ కే. విద్యాసాగర్ మాట్లాడుతూ.. ఈ నెల 10వ తేదీ నుంచి సుకన్య సమృద్ధి ఖాతా తెరిచేందుకు ప్రత్యేక మేళా నిర్వహిస్తోందని పది సంవత్సరాల లోపు ఉన్న ఆడపిల్లలు ఈ ఖాతా తెరవడానికి అర్హులన్నారు. పోస్టాఫీస్ కార్యాలయానికి వచ్చిన అర్హులైన వినియోగదారులకు సిబ్బంది దరఖాస్తు ఫారాలను అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌వో లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఓయూలో సంతకాల సేకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు రూ.1000 కోట్ల నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి మొదటి సంతకం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.రవినాయక్, శ్రీను, పవన్, కృష్ణ, అశ్విన్ రమ్య పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

చిలకలగూడ: ఆర్థిక ఇబ్బందులతో ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ హరీష్‌గౌడ్ వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్‌కు చెందిన విజయవంశీ (34) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈనెల 2న ఇంటి నుంచి వెళ్లి రాత్రైనా ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో భార్య రమ్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

'కంటివెలుగు'పై అవగాహన ర్యాలీ

పద్మారావునగర్: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శనివారం ఐడీహెచ్ కాలనీలో శనివారం స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. నాయకులు ఎల్. వెంకటేశన్, అంగముత్తు శ్రీనివాస్, సురేష్, వినోద్, అనంతరావు, నర్సింగ్‌రావు పాల్గొని మాట్లాడారు. ఈ నెల 6 నుంచి ఐడీహెచ్ కాలనీలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు కంటి వెలుగు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారని పరిసర ప్రాంతాల ప్రజలు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు.

టీచర్ల బదిలీల ప్రక్రియను వేసవి సెలవుల్లో నిర్వహించాలి

అడ్డగుట్ట: విద్యాశాఖ నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను వేసవి సెలవు దినాల్లో నిర్వహించాలని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం(సీఆర్పీఎఫ్) రాష్ట్ర కన్వీనర్ వేణుగోపాల్ అన్నారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ తెలంగాణ, హైద్రాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారులకు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఆర్పీఎఫ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. విద్యాశాఖ నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను నిర్వహిస్తే విద్యార్థులకు బోధనలు సరిగ్గా జరగడం లేదన్నారు. కోవిడ్ కారణంగా గత రెండేళ్ల నుంచి విద్యలో వెనుకబడ్డారని ప్రస్తుతం పరీక్షల సమయ కాలం దగ్గర పడుతున్న నేపథ్యంలో బదిలీల ప్రక్రియ కారణంగా పాఠ్యాంశాలు పూర్తి కావడం లేదని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చింతల లక్ష్మీనారాయణ, సత్యవతి, అనిత గౌడ్, కే. అలివేలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్న ఇద్దరి అరెస్టు

సనత్‌నగర్: మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్న ఇద్దరిని సికింద్రాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కశ్మీర్‌కు చెందిన సోదరులు షౌకత్ అలీ, బషీర్ అహ్మద్ 30 ఏళ్ల క్రితం నగరానికి వచ్చి కుత్బుల్లాపూర్‌లో ఉంటూ టీ స్టాల్, జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో డబ్బు సంపాదించాలనే దురాశతో గత కొన్ని రోజులుగా గంజాయి, పాపిస్ట్రా అనే మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నవనీత నేతృత్వంలో సిబ్బంది ప్యారడైజ్ సర్కిల్ వద్ద ఇద్దరిని అదుపులోకి తీసుకుని కిలో గంజాయి, 200 గ్రాముల పాపిస్ట్రా స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై ప్రేమ్‌కుమార్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, ప్రసాద్, మధులను ఆమె అభినందించారు.

మంత్రి చొరవ.. బాలుడి ఆచూకీ లభ్యం



బన్సీలాల్‌పేట్: తప్పిపోయిన ఓ బాలుడు మంత్రి తలసాని చొరవతో ఎట్టకేలకు ఇంటికి చేరుకున్నాడు. గాంధీనగర్ ప్రాంతానికి చెందిన ప్రేరణ, దుర్గాప్రసాద్‌ల కుమారుడు కార్తీక్ ఐదు రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో అధికారులతో కలిసి పాదయాత్ర చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. చలించిపోయిన ఆయన బాలుడి ఆచూకీ కనుగొనాలని పోలీసులను ఆదేశించారు. రంగంలోకి దిగిన పోలీసులు ఎట్టకేలకు కార్తీక్ ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. శనివారం కార్తీక్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు, స్థానిక నాయకుడు ఎల్. వెంకటేశన్‌తో కలిసి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

చేయి చేయి కలిపి.. చెత్తను తరలించి..



మార్పు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బేగంపేట ప్రకాష్‌నగర్‌లో శనివారం క్లీన్‌అప్ కార్యక్రమాన్ని చేపట్టారు. సుమారు 40 మంది వలంటీర్లు అక్కడ పేరుకుపోయిన 7 క్వింటాళ్ల చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించి పరిశుభ్రంగా మార్చారు. క్లీన్‌అప్ కార్యక్రమంలో పాల్గొనడం, సంతృప్తికరంగా ఉందని వలంటీర్లు రవి, ప్రియాలు చెప్పుకొచ్చారు.

– సనత్‌నగర్

అవినీతి నిర్మూలనలో యువత ముందుండాలి

రాంగోపాల్‌పేట్: సమాజంలో పెరిగిపోతున్న అవినీతి నిర్మూలనలో యువత బాధ్యతాయుతంగా ఉండాలని ఆదాయ పన్ను శాఖ డిప్యూటీ కమిషనర్ (హైదరాబాద్) ఆర్. జయకుమార్ అన్నారు. సికింద్రాబాద్‌లోని వెస్లీ డిగ్రీ కళాశాలలో రెండ్రోజుల పాటు నిర్వహించిన వెస్కాన్–23 శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. యువత విద్యార్థి దశ నుంచే సమాజాన్ని పట్టిపీడిస్తున్న అనేక రుగ్మతల మీద పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడు రాబోయే తరాలకు అత్యుత్తమ సమాజాన్ని అందించగలుగుతామని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే వివిధ జూనియర్, డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులకు క్రీడలు, సైన్స్, సాంస్కృతిక కార్యక్రమాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ బీ. విమల్ సుకుమార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెగోని, శ్రవీన్ కృపాకర్, జయరాజ్ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



బహుమతులు అందిస్తున్న దృశ్యం

చిలకలగూడ: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ముషీరాబాద్ మండల ఉప విద్యాధికారి చిరంజీవి అన్నారు. అమరావతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. మేడిబావి పాఠశాల ప్రాంగణంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మండల ఉప పర్యవేక్షణాధికారులు శ్రీనివాసరాజు, స్వరూపరాణితో కలిసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మానసిక, శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదపడతాయన్నారు. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వేంకటేశ్వరరెడ్డి, ప్రసన్నలక్ష్మీ, కవితారెడ్డి, వీణారెడ్డి పాల్గొన్నారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు కేటాయించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: అర్హులైన వారందరికీ డబుల్ బెడ్రూమ్ మంజూరు చేయాలని సీఐటీయూ నగర అధ్యక్షులు కుమార స్వామి డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో మారేడుపల్లి మండల కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. నగరంలో పూర్తయిన ఇళ్లను అర్హులైన పేదలకు వెంటనే కేటాయించి, సొంత స్థలాల్లో ఇల్లు కట్టుకునే పేదలకు రూ. 5 లక్షలు ఇవ్వాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నగరంలో సుమారు 9 లక్షల మంది పేదలు డబుల్ బెడ్రూమ్‌ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వాటిని వెంటనే పరిశీలన చేసి అర్హులైన పేద ప్రజలకు కేటాయించాలన్నారు. అనంతరం, ఇన్‌చార్జ్ తహసీల్దార్ హసీనాకు వినతిపత్రం ఇచ్చారు. ధర్నాలో ఆర్. మల్లేష్ టీ. మహేందర్, గోపాల్, అజయ్ బాబు, ప్రవీణ్, బాలయ్య, వీరలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులు స్పందించాలి



వృద్ధురాలితో మాట్లాడుతున్న కొంతం దీపిక

రాంగోపాల్‌పేట్: మురుగు నీటి సమస్య తలెత్తే ప్రాంతాల్లో జలమండలి అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని మోండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక సూచించారు. శనివారం ఆమె చాయ్‌పే చర్చ కార్యక్రమంలో భాగంగా రెజిమెంటల్‌బజార్‌లోని వివిధ ప్రాంతాల్లో పాదయాత్ర చేస్తూ స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలోని సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేదని ఈ సందర్భంగా స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత అధికారులతో చర్చించి దశలవారీగా సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, అంజన్‌కుమార్, వీరవర్ధన్, జీతు, విజయ్‌కుమార్, మురళి, శ్రీధర్, సందీప్, నాని, సురేష్ పాల్గొన్నారు.

'న్యాక్' అక్రిడిటేషన్ సాధనలో భాగస్వాములవ్వాలి

సనత్‌నగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం న్యాక్ అక్రిడిటేషన్ సాధించడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆ వర్సిటీ అభ్యాసక సహాయ కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.రామాచారి కోరారు. బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ నుంచి శనివారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. 20 ప్రశ్నలతో కూడిన మెయిల్ వస్తుందని, విద్యార్థులు తరచూ మెయిల్స్ చూసుకోవాలన్నారు. న్యాక్ అక్రిడిటేషన్ అసెస్‌మెంట్‌లో భాగంగా యూనివర్సిటీ అందించే సేవలపై విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు న్యాక్ ప్రశ్నావళిని ఈ–మెయిల్ ద్వారా పంపుతుందన్నారు. మెయిల్ అందుకున్న విద్యార్థులు ఆ ప్రశ్నలకు తగిన జవాబులు గుర్తించి తిరిగి పంపాలన్నారు. సులువైన ఇంగ్లిష్‌లో 20 ప్రశ్నలు ఉంటాయని, ఆయా ప్రశ్నల కింద ఉన్న సమాధానాల్లో ఒక దానిపై క్లిక్ చేయాలని, అన్ని ప్రశ్నల సమాధానాలపై క్లిక్ చేశాక సబ్మిట్‌పై క్లిక్ చేయాల్సిందిగా కోరారు. విద్యార్థులు ఎలాంటి అనుమానాలు ఉన్నా అభ్యాసక సహాయ కేంద్రంలో సంప్రదించాలన్నారు. న్యాక్ నుంచి విడతల వారీగా పంపించే మెయిల్స్‌ను క్రమం తప్పకుండా గమనిస్తుండాలన్నారు. ఈ విషయమై చర్చించేందుకు ఆదివారం ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి విద్యార్థులు హాజరు కావాలన్నారు.